తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# శివయ్య సేవలో సంకట హర చతుర్థి



శ్రీకాళహస్తి, మార్చి 18 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం సంకటహర చతుర్థి పూజలను సంప్రదాయబద్దంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో పలుసేవలను భక్తుల భాగస్వామ్యం చేసారు. ఈ నేపధ్యంలో మంగళవారం సంకట హర చతుర్థి పూజలకు ఆలయ డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి దంపతులు హాజరై సంకల్పం గావించారు. ఈ సందర్బంగా అర్చకులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి వేదమంత్రాలను పఠిస్తుండగా హోమాలను నిర్వహించి పూర్ణాహుతి గావించారు. అర్చకులు శ్రీనివాసులు గురుకుల్ సంప్రదాయబద్దంగా పూజలు నిర్వహించారు. ఈ పూజలను కన్యమూల గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసారు. ఆలయాధికారులతో పాటు ఆలయానికి వచ్చిన భక్తులు కూడా పాల్గొన్నారు. ఈ పూజల్లో డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి దంపతులు, ఆలయ సూపరింటెండెంట్‌నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్సెపెక్టర్ హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో ఇక మరింత ప్రశాంతం

## శాంతిభద్రతల పరిరక్షణ సులభం- పల్లెనిద్ర చేపట్టిన పోలీసులు



తిరుపతి, మార్చి 18ప్రభాతవార్త:

అరమరికలు లేని గ్రామాల్లో ఎటువంటి ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకోకుండా జిల్లా పోలీసుయంత్రాంగం సిద్దమైంది. ఇందుకోసం పల్లెనిద్ర పేరుతో వినూత్నకార్యక్రమాన్ని పున:ప్రారంభించి చేపట్టేలా జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు అధికారులను సమాయత్తం చేశారు. పల్లెలు ప్రశాంతతకు, పచ్చనివాతావరణానికి చిహ్నాలు. పల్లెల్లో శాంతిభద్రతలు పరిరక్షణ, ప్రజల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పేలా పల్లెనిద్ర చేపట్టడం నిజంగా అద్భుతమే. రాజకీయంగా కక్షలు, కార్పణ్యాలు లేకుండా అందరినీ ఒకచోట చేర్చి దిశానిర్దేశం చేస్తారు. జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌ల పరిధిలో సిఐలు, ఎస్‌ఐలు, చివరకు డిఎస్పీలు కూడా పల్లెనిద్ర చేసి ఆరోజంతా సాయంత్రం 6గంటల నుండి మరుసటిరోజు ఉదయం 6గంటల వరకు ఆ గ్రామంలోనే ఉంటారు. సాయంత్రం గ్రామస్థులను, మహిళలను, యువతను ఒకచోట చేర్చి వారికి మంచి, చెడులను వివరించడంతోబాటు అనుమానిత వ్యక్తులు, సైబర్ నేరాలుపై అవగాహన కల్పిస్తారు. మహిళలపై దాడులు జరుగుతున్న సమయంలో ఎదుర్కోవాల్సిన విషయాలను తెలియజేసి అవగాహన కల్పిస్తారు. యువతీయువకులు చెడు మార్గంలో వెళ్ళకుండా, మత్తుకు బానిసలు కాకుండా చైతన్యం చేయడం ప్రధానంగా ఉంటుంది. పెద్దలు, కుటుంబసభ్యుల పట్ల మెలగాల్సిన తీరును వివరిస్తారు. పోలీసులు పల్లెల్లో నిద్రచేయడం గ్రామప్రజలతో పోలీసులకు మధ్య సత్సంబంధాలు నెలకొనేందుకు వీలుకలుగుతుంది. ఇప్పటికే తిరుపతి జిల్లాలో అనేక పోలీసు సబ్‌డివిజన్‌లలో ,పోలీసుస్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో పల్లెనిద్ర చేపడుతున్నారు. దీనిపై జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు కూడా ప్రత్యేకంగా చొరవతీసుకుని పర్యవేక్షణ చేస్తున్నారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

# అనుమానాస్పద మృతి

**కొమరగుంట ప్రధాన రహదారిపై గ్రామస్తులు ధర్నా, ఉద్రిక్తత**
**- తోపులాటలో కానిస్టేబుల్‌కు స్వల్ప అస్వస్థత**
**- న్యాయం చేయాలంటూ మహిళలు ఆందోళన**



కొమరగుంట రోడ్డు పై ధర్నా చేస్తున్న మహిళలు

వెదురుకుప్పం, మార్చి 18 ప్రభాతవార్త :

హైదరాబాదులో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనుమానాస్పదంగా మృతి చెందడంతో సమాచారం తెలిసి మండలంలోని కొమరగుంట గ్రామస్థులు తమకు న్యాయం చేయాలంటూ తిరుపతి పచ్చికాపల్లం ప్రధాన రహదారిలో ధర్నా రాస్తారోకో నిర్వహించారు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని కొమరగుంటకు చెందిన గోవింద రెడ్డి కుమారుడు మహేష్(28) హైదరాబాద్‌లో కొంత కాలంగా సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నారని చెప్పారు. కాగా ఇటీవల వెదురుకుప్పం మండలం దామరకుప్పం గ్రామంకు చెందిన ఓ అమ్మాయిని ప్రేమ వివాహం చేసుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో సోమవారం మహేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందిన్నట్లు చెప్పారు. అయితే మహేష్ మృతిపై పలువురు పలు రకాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం కొమరగుంట గ్రామస్థులు మహేష్‌ది ఆత్మహత్య కాదని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో ధర్నాకు దిగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గింది. సమాచారం తెలుసుకున్న కార్వేటినగరం సర్కిల్ ఇన్‌ఫెక్టర్ హనుమంతప్ప, ఎస్ఐ వెంకటసుబ్బయ్యలు సిబ్బందితో సంఘటన స్థలంకు చేరుకుని మహేష్ కుటుంబ సభ్యులు, ఆందోళన కారులతో చర్చించారు. కాగా పరిస్థితి ఉద్రిక్తతంగా మారి తోపులాటలు జరగడంతో ఓ కానిస్టేబుల్ కిందపడి స్వల్ప అస్వస్థతకు గురైనారు. మృతదేహం అప్పగించాలని, మృతిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని పట్టు బట్టడంతో పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది. హైదరాబాదు నుంచి మృత దేహం వచ్చిన తరువాత వారి కుటుంబ సభ్యులతో చర్చించి మృత దేహం అప్పగించారు. దహన క్రియలు పోలీసుల సహకారంతో పూర్తిచేశారు. తదుపరి పోలీసుల దర్యాప్తులో మహేష్‌ది ఆత్మహత్యా .... హత్య వెలుగు చూడాల్సి ఉంది.

## సామర్థ్యానికి మించి

# విద్యార్థులను తరలించొద్దు

**"పది"ఫరీక్షల విద్యార్థులకు అసౌకర్యం కలిగించొద్దు**
**-ఆర్‌టిఓ కొర్రపాటి మురళీమోహన్**



తిరుపతి(రవాణ), మార్చి 18ప్రభాతవార్త:

పదవతరగతి పరీక్షలు రాసేందుకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం బస్సుల్లో, ఆటోల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్నారని, మరీ స్కూల్ బస్సుల పుట్‌పాత్‌లపై కూడా విద్యార్థులు ఉంటున్నారని తిరుపతి జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. ఇలా నిబంధనలు విరుద్దంగా, ప్రమాదకరంగా తరలిస్తే ఆ బస్సులపై, యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత ఆయా యాజమాన్యాలదేనని అన్నారు. ఆటోల్లో, ట్యాక్సీల్లో సామర్థ్యానికి మంచి విద్యార్థులను తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. విద్యార్థుల భద్రత, సురక్షిత ప్రయాణం చూడాలని ఆయన తెలిపారు. పదవతరగతి విద్యార్థులకు ఎవరూ కూడా అసౌకర్యం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రశాంత మనసుతో ఒత్తిడిలేని పరీక్షలు రాసేందుకు సహకరించాలని కోరారు.

# పకడ్బందీగా మాతా శిశు సంరక్షణ

## - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి

చిత్తూరు, మార్చి 18 ప్రభాతవార్త:

జిల్లాలో మాతా శిశు సంరక్షణను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవాకం డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుధారాణి ఆధ్వర్యంలో మాతా శిశు సంరక్షణపై ఆశా నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. డిఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వం అందించే సేవలను క్షేత్ర స్థాయిలో పక్కాగా అందించాలని, అప్పుడే మాతా శిశు మరణాలు లేని సమాజ ఆవిష్కరణ సాధ్యమన్నారు. నోడల్ ఆఫీసర్లు ఆశాలు, ఎఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిల ద్వారా సేవలు పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు అవసరమైన వైద్య సేవలను గర్భిణీలకు అందించాలన్నారు. అలాగే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం వంద శాతం అయ్యేలా ప్రతి ఒక్కరు బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. అడిషనల్ డిఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ అనూష, డాక్టర్ ప్రవీణ, రామ్మోహన్, మూర్తి, ఆశా నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావ స్థితి కారణంగా రైతులను ఆదుకోవాలి

## పార్లమెంట్లో ఎంపీ మద్దెల గురుమూర్తి



వెంకటగిరి, మార్చి 18, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతుల పంట భద్రతపై ముందు చూపుతో వ్యవహరించాలని ఎంపీ మద్దెల గురుమూర్తి పార్లమెంట్లో ప్రశ్నించారు. మైక్రో ఇరిగేషన్ అమలు, తిరుపతి జిల్లాలో సాదించిన పురోగతి, లబ్ధిదారులు వివరాలు, సూక్ష్మ నీటిపారుదల సాంకేతికత ప్రోత్సాహం గూర్చి తిరుపతి ఎంపీ ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామనాథ్ ఠాకూర్ సమాధానం ఇచ్చారు. పర్ డ్రాప్ మోర్ క్రాప్ పథకం 2015-16 నుంచి దేశవ్యాప్తంగా అమలులో ఉందని తెలిపారు. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు 96.97 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో మైక్రోఇరిగేషన్ చేపట్టారని తెలిపారు. తిరుపతి జిల్లాలో 20,819 హెక్టార్లు మైక్రో ఇరిగేషన్ కింద కవర్ చేయబడిందని తెలియజేశారు. లబ్ధిదారులు, వారికి అందిస్తున్న ఆర్థిక సహాయం వివరాల గూర్చి వెల్లడిస్తూ సన్న, చిన్నకారు రైతులకు 55 సబ్సిడీ, ఇతర రైతులకు 45 సబ్సిడీ అందిస్తున్నామని పేర్కొన్నారు. 2015 - 16 నుండి ఇప్పటి వరకు తిరుపతి జిల్లాలో 19,272 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందారని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అదికారిక లెక్కల ప్రకారం తక్కువ నీటి వినియోగంతో పండే పంటల ప్రోత్సాహంలో బాగంగా 2022 - 23 నుండి 2024 - 25 వరకు 14,332 హెక్టార్ల విస్తీర్ణంలో బోర్‌వెల్ ఆధారిత వరి, పొగాకు పొలాలను పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల పంటలు పండించేలా పంట మార్పు చేశారని తెలిపారు. ఇందులో బాగంగా రూ.1.38 కోట్ల ఆర్థిక సహాయం అందించారని అన్నారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఖర్చు తక్కువ, అధునాతన నీటి నిర్వహణ పద్ధతులు, వర్షపు నీటి సంగ్రహణ, రీసైక్లింగ్, వర్షపు నీరు, ఉపరితల, భూగర్భ జలాలను సమన్వయంగా వినియోగించే విధానాల రూపకల్పన, స్మార్ట్, ప్రెసిషన్ టెక్నాలజీల ద్వారా సమర్ధవంతమైన సాగు విధానాలు, సరైన నీటి పారుదల విధానాలు, భూసంరక్షణ పద్ధతులు అవలంబిస్తున్నామని తెలిపారు.

# వెటర్నరీ కళాశాలలో స్థంభించిన బోధన

**జూడాల సమ్మెతో 44 రోజులుగా తెరుచుకోని తరగతి గదులు**
**17 విభాగాలకు తాళం...ఛాంబర్లకే పరిమితమైన అధ్యాపకులు**





తిరుపతి విద్య మార్చి 18 ప్రభాతవార్త

ఎస్వీ వెటర్నరీ కళాశాల తరగతి గదులు 44 రోజులుగా తాళం తెరుచుకోని పరిస్థితి నెలకొంది. గౌరవ వేతనం పెంచాలంటూ నిరవధిక సమ్మెలో ఉన్న వెటర్నరీ విద్యార్థులను వర్సిటీ అధికారులు, ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో కళాశాల తరగతి గదులకు వేసి తాళం వేసినట్టే ఉంది. కళాశాల ప్రాంగణం నిర్మానుష్యంగా మారింది. అధ్యాపకులు, బోదనేతర సిబ్బంది తమ ఛాంబర్లకే పరిమితమయ్యారు. ప్రతి రోజు ఉదయం 9గంటలకు కళాశాలకు రావడం ఛాంబర్ లో ఖాలీగా కూర్చుని కబుర్లు చెప్పుకోవడం పరిపాటిగా మారింది. వర్సిటీలో అధికారులకు సైతం అదేతంతు కొనసాగిస్తున్నారు. విద్యార్థుల న్యాయపరమైన డిమాండుపై దృష్టి సారించి సమ్మెను విరమింపజేయాలనే ఆలోచన లేకపోవడం దారుణమంటూ విద్యావంతులు, మేధావులు ఆవేదన చెందుతున్నారు.

**పరీక్షలు,ప్రాక్టికల్స్ పై నెలకొన్న అయోమయం**

వెటర్నరీ కళాశాలలో సుమారు 17 విభాగాలలోని అన్ని తరగతి గదులకు వేసిన తాళం తెరవలేదు. దీంతో సుమారు 70 మంది అధ్యాపకులు బోధనకు దూరమయ్యారు. 2024 25 విద్యా సంవత్సరం చివరి దశలో ఉన్న నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తు ఆగమ్య గోచరంగా మారింది. ప్రధానంగా అడమిక్ సిలబస్ పూర్తి కాకపోవడం, పరీక్షల నిర్వహణ, ప్రాక్టికల్స్ పై అయోమయం నెలకొంది. కానీ అధికారులు, అధ్యాపకులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సమస్యను పరిష్కరించే ఆలోచనా ధోరణిలో ఉన్నట్లు కనబడలేదు. సాధారణంగా వచ్చేనెలలో బీవీఎస్సీ చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు, ప్రాక్టికల్స్ నిర్వహించాల్సి ఉన్నట్లు సమాచారం. తమ న్యాయమైన డిమాండ్ ను పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని వెటర్నరీ జూడాలు భీష్మించుకు కూర్చున్నారు. అధికారుల మొండివైఖరికి తోడు ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు యావత్ వెటర్నరీ జూడాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని వాపోతున్నారు.

# శ్రీసిటీని సందర్శించిన నేషనల్ డిఫెన్స్ కళాశాల అధికారుల బృందం




సత్యవేడు, మార్చి 18 ప్రభాతవార్త:

భారతదేశ పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, ఆర్థికాభివృద్ధిపై అధ్యయనంలో భాగంగా న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కాలేజీ(ఎన్‌డీసీ)కు చెందిన 17 సభ్యులప్రతినిధి బృందం మంగళవారం శ్రీసిటీని సందర్శించింది. మేజర్ జనరల్ సీపీ సంగ్రా, ఏవీఎస్ఎం వైఎస్ఎం(రిటైర్డ్) నేతృత్వంలోభారత సాయుధ దళాల ఉన్నతాధికారులు, విదేశీ ప్రతినిధులతో సహా విచ్చేసిన బృందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ఏకీకృత వ్యాపారానుకూల వాతావరణం, ప్రపంచ పెట్టుబడులకు అనువైన గమ్యస్థానం, భారతదేశ తయారీ, లాజిస్టిక్స్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో భాగస్వామ్యం గురించి ఆయన వారికి వివరించారు. పారిశ్రామిక కేంద్రం ప్రత్యేకతలను వివరిస్తూ ఇక్కడి ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక వసతులు నైపుణ్యాభివృద్ధి వంటి పలు కార్యక్రమాలు శ్రీసిటీని స్థిరమైన వృద్ధి, సామాజిక ఆర్థిక పురోగతికి ఒక నమూనాగా మార్చిందని పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీపరిసరాలతో పాటు కోల్గేట్, పెప్సీ పరిశ్రమలను వారు సందర్శించారు. వికసిత్ భారత్ లక్ష్యంగా శ్రీసిటీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సాగిస్తూ, ఇక్కడ క్రమశిక్షణ అద్భుతమంటూ టీమ్ లీడరు ప్రశంసించారు. ఈ పర్యటన కో-ఆర్డినేటర్‌లుగా ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఏపీహెచ్ఆర్‌డీఐ) డైరెక్టర్ జి.శ్రీనివాసులు, కొంత మంది సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# పలమనేరు మున్సిపాలిటీకి నీటి సమస్య తప్పదా..!

**పలమనేరు మున్సిపాలిటీకి నీటి సమస్య తప్పదా..!**
**-అడుగంటుతున్న బోర్లు..7 నెలల క్రితమే ఆగిన వైఎస్ఆర్ జలాశయం నీరు..**
**-ఇప్పటికే పలు వార్డులకు సకాలంలో అందని నీరు..**



పలమనేరు, మార్చి 18, ప్రభాతవార్త:

ఈ వేసవి పట్టణ ప్రజలు నీటి ఎద్దడి తప్పేట్లు లేదు. ప్రతి ఏటా వర్షాకాలంలో సమీపంలోని వైఎస్ఆర్ జలాశయం, చెరువులలో నీటి నిల్వలతో పలమనేరు మున్సిపాలటీకి నీటి సమస్య లేకుండా ఉండేది. అయితే ఈ ఏడాది నమోదపై అతి తక్కువ వర్షపాతంలో పట్టణ సమీపంలోని చెరువులు ఇప్పటికే అడుగంటాయి. ప్రతి ఏటా వేసవి కాలంలో స్థానిక బోర్లతో పాటు వైఎస్ఆర్ జలాశయం నుండి పట్టణ ప్రజలకు నీరు అందుతుండేది. అయితే 7 నెలల క్రితమే వైఎస్ఆర్ జలాశయం అడుగంటి పోవడంతో పలమనేరు మున్సిపాలటీకి వైఎస్ఆర్ జలాశయం నుండి నీటి సరఫరా ఆగిపోయింది. ఈ క్రమంలో పలమనేరు పట్టణంలోని మున్సిపల్ బోర్లపై ఆధార పడి ఈ వేసవి కాలాన్ని ప్రజలు గడపాల్సి ఉంది. అయితే పలమనేరు సమీపంలో ఇప్పటి వరకు మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో సుమారు 80 బోర్లను వేయడం జరిగింది. ఆ బోర్లు ప్రధానంగా గంటావూరు సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద 10 బోర్లు, గాంధీనగర్ వద్ద 9 బోర్లు, నాగమంగళం వద్ద 9 బోర్లు, పట్టణ పరిసర ప్రాంతాలలో మిగిలిన బోర్లు ఉన్నాయి. అయితే ఇప్పటికే కొన్ని బోర్లలో నీరు అడుగంటి పోతున్నాయని సమాచారం. ఇందుకు ప్రత్యన్యాయంగా బోర్లలో అధనపు పైపులను ఏర్పాటు చేయడం, పూడిన బోర్లను రీ డ్రిల్ చేపట్టడంపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. అయితే భూగర్భ జలాలు అడుగంటుతున్న ఈ సమయంలో వీరి ప్రయత్నం ఫలిస్తూందా అన్న ప్రశ్నలు లేకపోలేదు.

**సుమారు 1300 అడుగులు బోర్లు వేసిన ఫలితం శూన్యం:**

పలమనేరు పరిసర ప్రాంతాలలో ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో వ్యక్తి గతంలో కొంత మంది సుమారు 1300 నుండి 1800 అడుగుల వరకు బోర్లు వేసినప్పటికి చుక్క నీరు రాకపోవడం ఇందుకు నిదర్శనం. పలమనేరు మిట్ట ప్రాంతం కావడంతో స్థానిక రైతుల పొలాల వద్ద బోర్లు ఉన్నప్పటికి సమీపంలోని నదులలో నీరు ప్రవహిస్తూంటేనే బోర్లలో నీటి ఆనవాళ్ల ఉంటుంది. నదులలో నీరు లేకుంటే బోర్లు అడుగంటి పోవడం తప్పదు. ఇలాంటి పరిస్థితులలో గత 3 సంవత్సరాలుగా పలమనేరులో వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో పట్టణ సమీపంలోని చెరువులు, నదులలో ఇప్పటికే నీరు అడుగంటి పోయింది. ఈ క్రమంలో ఈ వేసవి కాలం ప్రారంభం కాకమునుపే పట్టణంలో నీటి సమస్య తలెత్తుతుంది. పట్టణంలో మున్సిపల్ బోర్లు 80 ఉన్నప్పటికి రాబోవు రోజులలో సుమారు 10కి పైగా బోర్లలో నీరు అడుగంటి పోవడం తప్పదని మిగిలిన బోర్లలోని నీటిని పట్టణంలోని ప్రజలకు సరఫరా చేయల్సి వస్తుందని, దీంతో ఎంతమాత్రం ప్రజలకు నీటిని అందించగలమన్న విషయంపై ఇప్పటికే మున్సిపల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

**పట్టణంలోని పాత పేటకు తప్పని నీటి తిప్పలు:**

పలమనేరు పట్టణంలోని పాతపేటకు ఒకవైపు వేసవి కాలం ప్రారంభం కాకమునుపే నీటి సమస్యలు తలెత్తింది. గత 10 రోజులుగా పట్టణంలోని పాతపేటలోని కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరా అందడం లేదని కౌన్సిలర్లు అధికారులకు ఫిర్యాదులు చేపడుతున్నారు. పట్టణంలో ఇది వరకే వైఎస్ఆర్ జలాశయం నుండి నీటి సరఫరా ఆగిపోవడంతో మున్సిపల్ పరిధిలోని సుమారు 80 బోర్ల నుండి నీటిని పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులు అందిస్తున్నారు. గతంలో రెండు రోజులకు ఒక సారి అందిస్తున్న నీటి సరఫరాను ప్రస్తుతం 3 రోజులకు ఒక్కసారి అందిస్తున్నారు. అయితే పాత పేటలోని 16 వార్డుకు చెందిన గ్యాస్ ఆఫీస్ వీధి, మిషన్ స్కూల్ వీధి, నరసింగరావు వీధి, జియ్యప్ప వీధి, మునిపాపన్న వీధి, టికే స్ట్రీట్, బజంత్రి వీధులలో సుమారు 10 రోజులుగా నీరు అందడం లేదని 16వ వార్డు కౌన్సిలర్ శ్యామ్ సుందర్ రాజ్‌కు స్థానికులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఏదేమైనప్పటికీ వేసవి కాలం ప్రారంభం కాకమునుపే పట్టణంలో నీటి సమస్య ఎక్కువ కావడంతో ఈ వేసవి కాలం ఎలా గడుస్తుందన్న ప్రశ్నలు పట్టణ ప్రజలకు లేకపోలేదు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైన స్పందించి ముందస్తు చర్యలు తీసుకుని వేసవి కాలంలో పట్టణ ప్రజలకు నీటి కష్టాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# గూడూరు డివిజన్

## సర్క్యులర్ విధిగా అమలు చేయాలి



గూడూరు, మార్చి 18 ప్రభాతవార్త : 1/2019 సర్క్యులర్‌ను విధిగా అమలు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, గూడూరు డిపో మేనేజర్ కార్మికులను, అసోసియేషన్ నాయకులను దురుసుగా, అవమానకరంగా మాట్లాడే వైఖరిని మానుకోవాలని డిపో ప్రెసిడెంట్ ప్రవీణ్ డిమాండ్ చేశారు. మంగళవారం గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటిరోజు ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిపో చైర్మన్ భాష, సెక్రెటరి శ్రీనివాసులు, స్యారేజ్ సెక్రెటరి ప్రవీణ్, రీజినల్ వైస్ ప్రెసిడెంట్ వెంకయ్య, ట్రెజరర్ గౌస్, రమేష్, సుధాకర్, శేఖర్, సందాని, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణపై సిఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం : ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, మార్చి 18 ప్రభాతవార్త : ఎస్సీ వర్గీకరణ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాన్ని శాసనసభ లోని మాల, మాదిగ ప్రజాప్రతినిధులు అందరూ స్వాగతిస్తున్నామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఈ విషయమై మంగళవారం చంద్ర బాబును కలిసి తన మద్దతు తెలిపారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడు తూ చంద్రబాబునాయుడు మాల, మాదిగలకు ఎస్సీ రిజర్వేషన్ పేరుతో సమ న్యాయం చేస్తున్నారని, ఈ విషయంలో ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం వర్గీకరణ ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారని ఆమె చెప్పారు. ఇందుకు సంబంధించి రాజ్యాంగం పరంగా తీసుకోవాల్సిన చర్యలను చర్చించి నిర్ణయం తీసుకుంటారని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రిని అసెంబ్లీలోని పలువురు ఎస్సీకి చెందిన ప్రజాప్రతినిధులు కలిశారు.

## భగవద్గీత పోటీల్లో విద్యార్థికి ప్రథమ బహుమతి



సూళ్లూరుపేట, మార్చి 18 ప్రభాతవార్త : పట్టణంలోని బ్రైనిటాక్స్ ఇంగ్లీష్ మీడియం సిబిఎస్సి హైస్కూలులో చదువుతున్న 9వ తరగతి విద్యార్థిని జాహ్నవికి ఇస్కాన్ సంస్థ వారు భగవద్గీతపై నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా మంగళవారం జాహ్నవిని బ్రైనిటాక్స్ స్కూలు కరస్పాండెంట్ వేనాటి ధనంజయరెడ్డి ప్రత్యేకంగా అభినందిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శిరీష, హైస్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

## 20న ప్రత్యేక విద్యుత్ అదాలత్

కోట, మార్చి 18 ప్రభాతవార్త: కోట మండలం చెందోడు గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో ఈ నెల 20న ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించ చనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కెవి నరేంద్రరెడ్డి తెలిపారు. ఆయన మంగళ వారం విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారానికి కోట సబ్ డివిజన్‌కు సంబంధించి ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారుల పరిష్కారం కాని సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదుల ద్వారా తెలియజేస్తే ఆ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

## చేనేతకు ఉచిత విద్యుత్ విధానంపై హర్షం

సూళ్లూరుపేట, మార్చి 18 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేతలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు వరకు విద్యుత్‌ను ఉచితంగా అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవాసంఘం రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి బుద్ది విజయలక్ష్మి మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ విద్యుత్ విధానం పట్ల రాష్ట్రంలోని దేవాంగులకు, చేనేత వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న వారికి లబ్ధి చేకూరుతుందని బుద్ది విజయలక్ష్మి తెలిపారు.

## జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



గూడూరు, మార్చి 18 ప్రభాతవార్త: నెల్లూరులో 25 నుండి 28 తేదీల్లో జరిగిన కోచింగ్ క్యాంప్ లో ప్రతిభ కనబరిచిన జీఎస్ఆర్ మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులు మోడరెజ్ కంపెనీ సహాయ సహకారంతో మ్యాజిక్ బస్ ఫౌండేషన్ నిర్వహించే హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయ్యారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు మధుసూదన్ రావు మాట్లాడుతూ మా విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపిక కావడం ఎంతో గర్వకారణం. ఇది మరిన్ని విద్యార్థులకు ప్రేరణనిస్తుందని ఆశిస్తున్నాం. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచడంతో పాటు, మానసిక స్థైర్యాన్ని, క్రమశిక్షణను అలవర్చుతాయి. ఫిజికల్ డైరెక్టర్ ఎస్.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక, సామాజిక మెరుగుదలకు తోడ్పడతాయి. ఈ పోటీలు ఈ నెల 21, 22 తేదీల్లో హిమాచల్ ప్రదేశ్‌లోని బిడ్డీ యూనివర్సిటీలో జరుగనున్నాయి. హర్షవర్ధన్ (8వ తరగతి), ప్రవళిక (9వ తరగతి) విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థుల కృషికి తోడ్పడిన ఎస్. వెంకటసుబ్బయ్య (ఫిజికల్ డైరెక్టర్), మ్యాజిక్ బస్ ఫౌండేషన్ కోచ్ లతాని ప్రత్యేకంగా అభినందించారు.

## పార్టీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి



గూడూరు, మార్చి 18 ప్రభాతవార్త : జిల్లాలు, మండలాల వారీగా కమిటీలను ఏర్పాటు చేసి,పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేసి,పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి శివ నాగేశ్వరరావు గౌడ్ తెలియజేశారు. మంగళవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆయనకు పార్టీ నాయకులు స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ కల్చరల్ చైర్మన్ డాక్టర్ మిరియాల వెంకటరమణయ్య,నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదూరు మనోహర్,గూడూరు ఆర్.పి.ఐ పార్టీ నాయకులతో షేక్ బాషా, కనుపూరు రాజా, హరి, సుశాంత్ భూషణ, పృద్వి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 20న సామాజిక తనిఖీ ప్రజావేదిక

నాయుడుపేట, మార్చి 18 ప్రభాతవార్త : నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయం ఆవర్ణంలో ఈనెల 20వతేదిన డ్వామా పిడి ఆధ్వర్యంలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ కె.సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. మహత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ఏప్రిల్2023 నుండి మార్చి 2024 వరకు నాయుడుపేట మండలంలో జరిగిన వివిధ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు. తనిఖీల్లో గుర్తించిన అంశములపై ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో 20వతేదిన మధ్యాహ్న 2గంటలకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ తెలియజేశారు.

## గూడూరుని నెల్లూరు జిల్లాలో కలపాలి

### -అసోసియేషన్ల నిరసన



గూడూరు, మార్చి 18 ప్రభాతవార్త : గూడూరు సాదుపేట సెంటర్లోని ఎస్సీ హాస్టల్లో ఆవరణలో ఏపీ ప్రజా కుల సంఘాల ఐక్యవేదిక మరియు అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్. ఫెడరేషన్ ద్వారా గూడూరుని నెల్లూరు జిల్లాలో కలపాలని లేదా గూడూరునీ జిల్లాగా ప్రకటించాలని కోరటం జరిగింది. ఈ సమావేశంలో అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ షఫీ హారనె మాట్లాడుతూ గూడూరు నుంచి నెల్లూరుకు వెళ్లి రైతులు రెవెన్యూ పనులు సులభంగా చేసుకోవడానికి అవకాశం ఉండేదని ఐఏఎస్ ఐపీఎస్ అధికారులను త్వరగా కలవటానీ వీలువుండేదనీ ప్రజలకు చార్జీ భారం కూడా తగ్గుతుందని మైనింగ్ నిమ్మ వ్యాపారస్తులకు కూడా చాలా అను కూలంగా ఉండేదని గత ప్రభుత్వంలో గూడూరుని తిరుపతిలో జిల్లాలో కలిపి నందున ప్రజలు మరియు ఉద్యోగస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారని కావున తక్షణం రాష్ట్ర ప్రభుత్వం గూడూరుని నెల్లూరులో కలపాలని 2025 డిసెంబర్ 31 లోపల గూడూరునీ నెల్లూరులో కలపకపోతే పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామనిషఫీ డిమాండ్ చేశారు. ఏపీ ప్రజా కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎల్వి సుబ్బయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం గూడూరుని తిరుపతి జిల్లాలో కలిపినందున ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలు విద్యార్థులు ఇబ్బందుల్లో పడుతున్నారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ గూడూరుని నెల్లూరు జిల్లాలో కలుపుతామని శాసనసభ సమావేశంలో కూడా మాట్లాడటం జరిగింది, కానీ ఇంతవరకు అమలు నోచుకోలేదన్నారు. ఈ సమా వేశంలో ఏపీ ప్రజా కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.వి సుబ్బయ్య, ప్రజాకుల సంఘాల కార్యదర్శి మంగల్పూరు గురునాథం, ప్రజా కులసంఘాల ఉపాధ్యక్షులు తిరగాబతిన శేషయ్య గౌడు, అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ సర్దారెషపిహారనె, స్టూడెంట్ జీవన్. మహేష్. మనోహర్, గోవర్ధన్, సాయి శ్రీనివాస్, గంగాధరు, సాయి మోహన్, సంతోష్. అశోక్, జాను పాల్గొన్నారు.

## ఉపాధ్యాయినకి సన్మానం



వెంకటగిరి, మార్చి 18 ప్రభాతవార్త : జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు సిహెచ్ రజనీకుమారిని ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన సందర్భంగా తోటి ఉపాధ్యాయులు సన్మానించారు. ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్ బెస్ట్ ఇంగ్లీష్ టీచర్ అవార్డు ఫంక్షన్ నెల్లూరు రావూస్ కాలేజీ మీటింగ్ హాల్లో 200మంది ఆంగ్ల ఉపాధ్యాయుల నడుమ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నెల్లూరు మండల విద్యా అధికారి హమీద్, ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణకుమారి, నారాయణ, జిల్లా ఉమ్మడిపరీక్ష విభాగం ప్రధాన కార్యదర్శి రామకుమార్ ఇంగ్లీష్ టీచర్స్ అసోసియేషన్ ఫౌండర్, ఈ అవార్డుల స్పాన్సర్ చంద్రకుమార్, అవార్డు సెలక్షన్ కమిటీ చైర్‌పర్సన్ స్టాన్లీ ప్రకాష్, ఈ టి ఏ ప్రెసిడెంట్ కోట శ్రీనివాసులు, సెక్రటరీ మల్లిఖార్జున, ఈటిఏ కమిటీ సభ్యులు బంక శ్రీనివాసులు, ప్రవీణ్ సామ్యూల్, వేంకటేశ్వర్లు, లక్ష్మి, లావణ్య, హరిబాబు, మహబూబ్ బాషా,కృపాల్, శ్రీహరి, జోసెఫ్ మొదలగు వారు పాల్గొన్నారు.

## ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించాలి

### -మంత్రులను కోరిన ఎమ్మెల్యే కురుగొండ్లరామకృష్ణ



వెంకటగిరి, మార్చి 18 ప్రభాతవార్త : రైతుల పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మంత్రులకు విజ్ఞప్తి చేశారు. రైతుల ఇబ్బందులపై చర్చించిన మంత్రులు నాదెండ్ల మనోహర్, ఎన్ఎండీ ఫరూఖ్, పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డిబీపీటీ పంట పండించిన రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ. కనీస మద్దతు ధర కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు కలెక్టర్‌తో పాటు జిల్లా ప్రత్యేక అధికారితో సమీక్ష నిర్వహించాలని ఎమ్మెల్యేలు నిర్ణయించారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావ్యా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

బాలాయపల్లి, మార్చి 18 ప్రభాతవార్త : మండలంలో ఈనెల 19వ తేదీ నుండి 22వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. 19వ తేదీ జయంపు, ఊట్లపల్లి, 20వ తేదీ పిరిమిడి, గొట్టిపాడు, 21వ తేదీ కోటంబేడు, కయ్యూరు, 22వ తేదీ వెంగమాంబరం, కాట్రగుంట సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## విద్యుత్ రాయితీకి వేళాయె..!

కోట, మార్చి 18 ప్రభాతవార్త : గృహ విద్యుత్ వినియోగదారులు రాయితీతో లోడు క్రమబద్ధీకరించుకునే అవకాశాన్ని కూటమి ప్రభుత్వం కల్పించింది. 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరణకు విద్యుత్‌శాఖ జూన్ 30వ తేదీ వరకు అవకాశం కల్పించింది. కొత్తగా ఇంటిని నిర్మించుకునే సమయంలో అప్పటి అవసరాలకు తగ్గట్టు వినియోగదారులు కిలో వాట్స్ లేదా రెండు కిలో వాట్లకు మాత్రమే విద్యుత్ కనెక్షన్ తీసుకొని ఉంటారు. తర్వాత కాలంలో ఏసీలు, గీజర్లు, వాషింగ్ మిషన్లు, ఫ్రిజ్‌లు తదితర వాటితో ఏటా విద్యుత్ వినియోగం పెరుగుతుంది. పాత గృహ సర్వీసులకు 0.5 కిలోవాట్స్, ఒక కిలో వాట్‌తోనే సర్వీసును తీసుకున్నారు. ఇలా తీసుకున్న వారిలో చాలామంది 3 కిలోవాట్లకు మించి లోడు వాడుతున్నారు. దీంతో పరివర్తకాలపై అదనపు భారం పడుతూ తరచుగా ఆ ప్రాంతంలో విద్యుత్ అంతరాయం లోఓల్టేజి సమస్య తలెత్తుతుంది. లోడు క్రమబద్ధీకరించుకుంటే ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తామని ఎడి చిన్నయ్య చెప్పారు. ప్రభుత్వం రాయితీ కల్పిస్తున్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## అడవి భూములు ఆక్రమిస్తే చర్యలు: సబ్ కలెక్టర్



వెంకటగిరి, మార్చి 18 ప్రభాతవార్త : అడవి భూములు ఆక్రమించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రాఘవేంద్ర మీనా చెప్పారు. మండలంలోని మన్నెగుంట గ్రామం వద్ద కొందరు అటవీ భూములను ఆక్రమించడంతో సబ్ కలెక్టర్ విచారణ జరిపారు. అటవీ భూములను ఆక్రమించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాయింట్ సర్వే చేసి అటవీ భూముల్లో ఆక్రమించినట్లు చెలితే ఆక్రమాణాలను తొలగిస్తామని చెప్పారు. భూముల ఆక్రమణలపై రెవిన్యూ వారి చేత జాయింట్ సర్వే చేస్తామని తెలిపారు. ఆయన వెంట తాసిల్దార్ రాంబాబు అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

## కుమ్మరిగుంట చెరువు కబ్జా



వెంకటగిరి, మార్చి 18 ప్రభాతవార్త: పట్టణంలోని కుమ్మర గుంట చెరువును ఆక్రమించి రియల్ ఎస్టేట్ యజమాని ప్లాట్లు వేశాడని, కుమ్మరకుంట చెరువును ఆక్రమిస్తే మున్సిపల్ అధికారులు కానీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ చెరువును పార్క్ వల్లే కూడా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే నిర్ణయించారు. వాకింగ్ ట్రాక్‌గా కూడా చెరువు కట్టమీద తయారు చేశారు. అయితే చెరువు కట్టపైనే రియల్ ఎస్టేట్ యజమాని రోడ్డును వేశారు. చెరువుతోపాటు సప్లై ఛానల్ కూడా పూర్తి వేశారు. ఐదవ వార్డ్ కౌన్సిలర్ నారి శేఖర్ చెరువును ఆక్రమించారని మున్సిపల్ అధికారులు, రెవెన్యూ వారికి ఫిర్యాదు చేసిన ఫలితం లేదని వాపోయారు. ఉన్నతాధికారులైన చర్యలు తీసుకుని చెరువు కట్టపై ఉన్న రోడ్డును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## స్విమ్స్‌చే చిల్లకూరులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్



చిల్లకూరు, మార్చి 18 ప్రభాతవార్త : స్విమ్స్ ఆధ్వర్యంలో మంగళవారం చిల్లకూరు పిహెచ్ సి కేంద్రంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ షాలోమ్ అరాఫత్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య భాను, స్థానిక నాయకులు నానాజి, పట్టాభిరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, రామ్మూర్తి, సూపర్వైజర్లు రవికుమార్, మునిలక్ష్మమ్మ, ఎంఎల్ హెచ్ పి లక్ష్మి, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## పేటలో మున్సిపల్ సాధారణ సమావేశం

నాయుడుపేట మార్చి 18 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో మున్సిపాల్టీ చేర్మేన్ కటకం దీపిక అధ్యక్షతన బుధవారం పురపాలక సంఘం సాదారణ సమావేశం నిర్వహిస్తునట్లు మున్సిపాల్టి కమిషనర్ పజులుల్లా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసమావేశంలో నాయుడుపేట పట్టణంలో నెలకొని ఉన్న సమస్యలపై చర్చించి నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈసాధారణ సమావేశానికి వైస్‌చేర్మేన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు,అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన తెలియజేశారు.

## రహదారులపై రక్తపు మరకలు

- ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదం
- గాల్లో కలుస్తున్న ప్రాణాలు.. గాయాలపాలవుతున్న యువకులు



తడ, మార్చి 18 ప్రభాతవార్త: అతివేగం, నిర్లక్ష్యం జాతీయ రహదారిపై పదే పదే ప్రమాదాలకు కారణమవుతున్నాయి. యువకులు అమితవేగంతో మోటార్‌బైక్‌లు నడపడం, స్నేహితులతో కలిసి కార్లను కూడా వేగంగా నడపడం వంటి కారణాలతో నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. తమిళనాడు సరిహద్దుల్లోని తడ మండలంలోని రహదారుల్లో రక్తపు మరకలు కనిపిస్తున్నాయి. ఇటీవల రామాపురం, భీములవారిపాలెం, పూడి, శ్రీసిటీ జీరో పాయింట్, బోడిలింగాలపాడు, అపాచీ మలుపు, కొండూరు, కాదలూరు మలుపుల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ నెల రోజుల వ్యవధిలో ఇక్కడ పలువురు మృతిచెందారు. స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో పనిచేసే వారు కూడా మృత్యువాతకు గురయ్యారు. పలువురు యువకులు గాయపడి వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడ జీవనోపాధి కోసం వచ్చిన వారు సైతం మృత్యుపాలవడం, వారి సమాచారం సేకరించి ఉత్తర భారతదేశంలోని బంధువులకు తెలియజేయడం పోలీసులకు కూడా కష్టసాధ్యమవుతోంది. ముఖ్యంగా తమిళనాడు, బీహార్ తదితర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి ఉద్యోగాలు చేసేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. హెచ్చరిక బోర్డులు ఉన్నప్పటికీ రవాణా శాఖ అధికారులు వేగ నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయి. దీనికితోడు రహదారుల పక్కనే మద్యం షాపులు యథేచ్ఛగా తెరవడం కూడా ప్రమాదాలకు ఒక కారణంగా మారింది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు, మృతిచెందిన వాలో ఎక్కువ మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు స్పష్టమవు తోంది. ఒక్క తడ మాత్రమే కాకుండా జాతీయ రహదారిపై అనేక మలుపుల్లో ప్రమాదాలు జరుగుతు న్నాయి. రవాణా శాఖ, పోలీసులు కలిసికట్టుగా వ్యవహరించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. జాతీయ భద్రత వారోత్సవాల పేరుతో కార్యక్రమాలు మొక్కుబడిగా నిర్వహించడం కాకుండా ప్రమాదాల నివారణపై పూర్తిస్థాయి దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నారు. ఇదిలావుంటే సోమవారం రాత్రి తడ మండల పరిధిలో రెండుచోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయి. స్థానిక పూడి గ్రామం సమీపంలో గూడూరు నుంచి యువకులు ఒక కారులో వెళుతూ లారీని ఢీకొనడంతో ఒక యువకుడు మృతిచెందగా, మరో నలుగురు యువకులు గాయపడ్డారు. పులివేంద్ర వద్ద జాతీయ రహదారి మలుపు తిరుగుతున్న మోటార్‌బైక్‌ను గుమ్మిడిపూండి నుంచి సూళ్లూరుపేట వైపు వెళుతున్న మరో మోటార్‌బైక్ ఢీకొనడంతో ముగ్గురు యువకులు గాయపడ్డారు. ప్రతినిత్యం ఎక్కడ ఏమి జరుగుతుందో అని తెలియడం లేదని పలువురు వాపోతున్నారు.

## ఉచిత విద్యుత్‌పై నగరి, పుత్తూరులో సంబరాలు



పుత్తూరు, మార్చి 18 ప్రభాతవార్త : ఎన్నికలపుడు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేనేత కార్మికులకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు నెలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తూ ఆదేశాలు జారీ చేయడం పట్ల నగరి నియోజకవర్గంలోని నగరి, పుత్తూరు పట్టణాల్లో వేలాది మంది చేనేత, మరమగ్గాల కార్మికులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకు న్నారని చంద్రబాబునాయుడును ప్రశంసించారు. తమ సమస్యను చంద్ర బాబు దృష్టికి తీసుకెళ్లి ఉచిత విద్యుత్ పంపిణీకి కృషి చేసిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్, చంద్రబాబునాయుడు చిత్రపటాలకు కార్మికులు పాలాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి, టపాసులు పేల్చారు.

## ఇంటి స్థలం కోసం దరఖాస్తులు చేసుకోండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, మార్చి 18 ప్రభాతవార్త: తిరుపతి నగరంలో ఇంత వరకు ఎటువంటి హౌసింగ్ స్కీమ్‌లో లబ్ధిపొందని అర్హులైన లబ్ధిదారుల నుండి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 31 వ తేదీలోపు దగ్గరలో ఉన్న వార్డ్ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంతవరకు ఏటువంటి హౌసింగ్ స్కీమ్స్‌లో అంటే, టిట్కో హౌసింగ్, నవరత్నాలు హౌసింగ్, దామినేడు, పాడిపేట, బాలాజీ డైరీ, తనపల్లి, వికృతమాల,తో పాటు ప్రభుత్వ సబ్సిడీ ద్వారా సొంతంగా ఇల్లు నిర్మించికున్న లబ్ధిదారులు కాకుండా, మిగతా వారు అర్హులని తెలిపారు. తిరుపతి నగరంలో అర్హులైన లబ్ధిదారుల నుండి డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులు మీ దగ్గరలో ఉన్న సంబంధిత వార్డు సచివాలయంలో అమెనిటి సెక్రెటరిని కలసి, లబ్ధిదారుల పత్రాలను సమర్పించాలని తెలిపారు.


**CHITTOOR URBAN DEVELOPMENT AUTHORITY, CHITTOOR**

**Roc No.108/2022/CHUDA Dated: 18.3.2025**

**e-procurement Tender Notice**

Tenders are invited from eligible contractors for **2 Nos., works** under CHUDA FUNDS 2024-2025 for worth of **Rs.46.73 lakhs** on e-procurement by under signed.

| SL No. | Bid down loading starting date and time | Last date & time for receipt of Bids |
|---|---|---|
| 1. | 19.03.2025 @ 6.00 pm | 04.04.2025 @ upto 3.00 pm |

For further full details contact at **7780661666** during the office hours on all working days


**Sd/- G.Vidyadhari**, I.A.S.,
Vice-Chairperson, CHUDA


## అక్షితకు హెవీడ్రైవింగ్ లైసెన్స్

### -ఆర్టీసి శిక్షణస్కూల్‌లో రెండో మహిళగా ప్రత్యేకత

తిరుపతి(రవాణ),మార్చి 18ప్రభాతవార్త: ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లోనూ ముందున్నారని, ఆర్టీసి బస్సులను నడపడంలోనూ అక్షితను ఆదర్శంగా తీసుకుని మరింతమంది ఉత్సాహం చూపాలని తిరుపతి జిల్లా డిపిటిఓ జి.నరసింహులు పిలుపునిచ్చారు. ఇప్పటికే అలిపిరి ఆర్టీసి డిపోలో శిక్షణ స్కూల్‌లో మొదటగా ఒక మహిళ హెవీ డ్రైవింగ్ లైసెన్స్ అందుకోగా రెండవ మహిళగా వి.అక్షిత ఉండటం గర్వకారణమన్నారు. ఆమె తిరుపతి పద్మావతి మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతోంది. అలిపిరి డిపో శిక్షణకళాశాలలో డ్రైవింగ్ శిక్షణ పొందిన ఆమెకు మంగళవారం సాయంత్రం సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. మహిళలు ఆర్టీసి బస్సులను నడిపేందుకు చొరవచూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి అకౌంట్స్ ఆఫీసర్ చంద్రమణి, డ్రైవింగ్ శిక్షణ కలాశాల శిక్షకులు సివి గోపాల్, వి.అక్షిత తండ్రి పాల్గొన్నారు.

## జూడో చాంపియన్‌షిప్‌లో తిరుపతి జిల్లా క్రీడాకారులు



తిరుపతి క్రీడ, మార్చి 18 ప్రభాతవార్త: జూనియర్ స్టేట్ జూడో చాంపియన్‌షిప్‌లో తిరుపతి జిల్లా క్రీడాకారులు జూడో జట్టు పతకాన్ని గెలుచుకున్నారు. మార్చి 15,16వ తేది విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లాలో జరిగిన రాష్ట్ర ఛాంపియన్‌షిప్‌లలో తిరుపతి జిల్లా క్రీడాకారులు 8పతకాలు కైవసం చేసుకున్నారు. శివ సాయి బంగారు పతకం, మల్లికార్జున్, హరి, శేఖర్, చాణిక్య, పాతిమా రజత పతకం, రామ్, బాలాజీ, బిందు కాంస్య పతకాలు అందుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను శాప్ చైర్మన్ రవి నాయుడు, డిఎస్ఓడి సయ్యద్, జిల్లా జూడో అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఆర్గనైజేషన్ సెక్రటరీ మనోజ్, ఎస్వి ఆర్ట్స్ కాలేజీ టిటిడి పిడి ముస్తాక్‌లు అభినందించారు.

## ఓటర్ల సంఖ్య పెరిగితే బైఫర్ కేషన్ చేస్తాం

### - రిటర్నింగ్ అధికారి రోస్‌మాండ్



సత్యవేడు, మార్చి 18 ప్రభాతవార్త: పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఓటర్ల సంఖ్య 1200 దాటితే బైపర్ కేషన్ చేసుకోవడానికి అవకాశం ఉన్నట్లు తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం ఎలక్ట్రో రిటర్నింగ్ అధికారి, భూ సంరక్షణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రోస్‌మాండ్ తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఓటర్ల నమోదు, తొలగింపు, పోలింగ్ కేంద్రాలు తదితరాంశాలపై వివిధ రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రస్తుతం రెండు లక్షల 14 వేల 992 ఓటర్లు ఉన్నట్టు పేర్కొన్నారు. ఇందులో పురుషులు 1 లక్షా 4వేల 146 కాగా, మహిళలు 1 లక్షా 10 వేల 835 మంది ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో 76,418 కుటుంబాలు నియోజకవర్గ స్థాయిలో ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతానికి ఓటర్ల సంఖ్య1200 దాటినవి బుచ్చినాయుడు కండ్రిగ మండలం వెస్ట్ వరవత్తూరు, వరదయ్యపాళెం మండలం చీలంపల్లిగ్రామాలు ఉన్నట్టు వివరించారు. సత్యవేడు మండలం రామచంద్రాపురం ఓటర్లు దాదాపు రెండు కి.మీ దూరంలో ఉన్న చెంగంభాకం గ్రామానికి వెళ్లి ఓటు వేసే పరిస్థితి ఉన్నట్టు వైసీపీ నాయకుడు శ్రీధర్‌రెడ్డి విన్నవించారు. అలాగే కేవీబీ పురం మండలం కొండల్ల ఆధవరం ఓటర్లు పేరందేశంకు వెళ్లి ఓటు వేస్తున్నట్టు సీపీఎం మండల నాయకుడు రమేష్ వీఆర్వో దృష్టికి తెచ్చారు. సత్యవేడు ప్రాంతం తమిళనాడుకు సరిహద్దును ఉండడం వల్ల అధికంగా బోగస్ ఓటర్లు నమోదు అయినట్టు బీజేపీ నాయకుడు బండారు మోహన్‌బాబు విన్నవించారు. సమస్యలపై ఎలక్ట్రో రిటర్నింగ్ అధికారి రోస్‌మాండ్ స్పందిస్తూ పోలింగ్‌కేంద్రాల బైపర్ కేషన్‌కి సంబంధించి సమగ్ర నివేదికను పంపాలని ఇన్‌చార్జి తహసీల్దార్ రాజశేఖర్‌ని ఆదేశించారు. ఈ సమావేశంలో పిచ్చాటూరు తహసీల్దార్ టి.వి.సుబ్రహ్మణ్యం, స్థానిక రెవెన్యూ డీటీ త్యాగరాజ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ మాధురి, టీడీపీ నాయకుడు దిలీప్, వైసీపీ నాయకుడు శ్యాంప్రసాద్‌రెడ్డి, బీజేపీ నాయకుడు మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.